సాక్షి
గుంటూరు
మంగళవారం । 21 । మే । 2024



వైభవంగా కలశాభిషేకం

బాపట్ల: శ్రీ భావపురి శ్రీనివాస శ్రీ విఖనస ఆశ్రమంలో లోక కల్యాణార్థం సోమవారం మహాశాంతి పూర్వక అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు.



రంగనాథుడి కల్యాణ ఉత్సవాలు

యడ్లపాడు: సొలసలోని భూ సమేత రంగనాయకస్వామి ఆలయంలో సోమవారం శ్రీలక్ష్మీ అమ్మవారికి పసుపు, కుంకుమ, ఫల, పుష్పాల వంటి 54 రకాల వస్తువులతో పూజలు చేశారు.

ముగిసిన బండ్లమ్మ కొలుపులు



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో శ్రీబగళాముఖి బండ్లమ్మ అమ్మవారి కొలుపులు ఆదివారం రాత్రి ముగిశాయి. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

న్యూస్‌రీల్

శాంతి చర్చల ద్వారా సమస్యల పరిష్కారం



తాడికొండ: శాంతి చర్చల ద్వారానే ఎంతటి సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని తుళ్లూరు డీఎస్పీ ఇ.అశోక్ గౌడ్ సూచించారు. తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో పోలింగ్ రోజున గొడవలు జరిగిన నేపథ్యంలో పోలీసులు సోమవారం ఇరు వర్గాలతో విడివిడిగా సమావేశమయ్యారు. ఒక్కో వర్గం నుంచి 15 మంది చొప్పున మొత్తం 30 మందితో శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం పూర్తిగా అవసరమని, చిన్నచిన్న విషయాలకు భేషజాలకు పోకుండా కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. వివాదాలు, కేసుల వల్ల ఏళ్ళ తరబడి కుటుంబాలు ఇబ్బంది పడతాయని వివరించారు. కేసులు నమోదైతే విద్యార్థుల జీవితాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని వెల్లడించారు. అనంతరం శాంతి కమిటీతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్, ఎస్ఐలు అంజయ్య, రవీంద్ర బాబు పలువురు సిబ్బంది, ఇరు వర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

22న ఐఎంఏ వైద్య విద్యా కార్యక్రమం

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న వైద్యులకు నిరంతర వైద్య విద్యా (సీఎంఈ) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం జీఎంఏ భవనంలో నిర్వహించే కార్యక్రమంలో గుండె సంబంధ వ్యాధులు – అత్యాధునిక చికిత్స పద్ధతులపై ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.ఎం.ఎస్.హరిత, ఎముకలు కీళ్ల వ్యాధులు– ఆధునిక శస్త్ర చికిత్స విధానాలపై డాక్టర్ గూడూరు జగదీష్, డాక్టర్ చిట్టా రంజన్ సాహూ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. వైద్యులందరూ ఈ వైద్య విద్యా కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని కోరారు.

ధీశాలి ప్రకాశం పంతులు



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): తెల్లదొరల తుపాకులకు తన గుండెను చూపి ముందుకు సాగిన ధీశాలి టంగుటూరి ప్రకాశం పంతులు అని శాసన మండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి కీర్తించారు. టంగుటూరి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని విప్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన ప్రకాశం పంతులు అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడ్డారన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని నీతినిజాయితీతో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన ఘనత టంగుటూరి సొంతమన్నారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రవేశించినా అవసరమైతే గాంధీనే ప్రశ్నించే రాజీలేనితత్వం ప్రకాశం పంతులదని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు నేటి యువతకు ఆదర్శమన్నారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో గొప్ప పాత్ర పోషించి భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారీ), వైఎస్సార్ సీపీ నేతలు పరిశపోగు శ్రీనివాసరావు, నరసింహారావు, వెలుగూరి రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా చోరీ

చీరాల అర్బన్: చీరాల రూరల్ మండలం పుల్లాయపాలెంలోని పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరా చోరీకి గురైంది. ఈపూరుపాలెం రూరల్ పోలీసుల వివరాల మేరకు.. పుల్లాయపాలెంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌లో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే, అందులో ఒకటి కనిపించలేదు. మహిళా పోలీసు ధనలక్ష్మి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

పచ్చ రాక్షసం

మాచర్ల టార్గెట్‌గా 'దేశం' ఆపరేషన్ దమనకాండ

- వత్తాసు పలికిన పోలీసు అధికారులు
- స్పందించని నాటి జిల్లా కలెక్టర్
- ఎన్నికలు ముగిసిన తర్వాత ఘర్షణలకూ వారే కారణం
- సిట్ బృందానికి ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ





ఎన్నికల సందర్భంగా రెంటచింతల మండలంలో జరిగిన టీడీపీ మూకల దాడుల్లో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మాచర్లలో జెండా పాతడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ చేసిన ఆపరేషన్‌కు పోలీసు ఉన్నతాధికారులు, సర్కిల్ అధికారులు అండగా నిలిచారు. పోలింగ్ రోజు, తదనంతరం అక్కడ జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేస్తున్నా డీఐజీ గానీ, అప్పటి ఎస్పీ గానీ, కలెక్టర్‌గానీ స్పందించకపోవడం దీన్ని బలపరుస్తోంది. తెలుగుదేశం పార్టీ తమ సామాజిక వర్గం అధికంగా ఉన్న గ్రామాల్లో మొదటి నుంచి వ్యూహాత్మకంగా రిగ్గింగ్ చేయడానికి సన్నాహాలు చేసుకుంది. చివరి నిముషంలో అదే సామాజిక వర్గానికి చెందిన అధికారినీ తీసుకురావడంతో ఆ పార్టీ నేతలు మరింత రెచ్చిపోయారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల తర్వాత కూడా మాచర్ల రణరంగాన్ని తలపించింది. టీడీపీ కుట్రలు, కుయుక్తులపై వైఎస్సార్ సీపీ బృందం సోమవారం ఎన్నికల సంఘం నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) అధినేత వినీత్ బ్రిజ్‌లాల్‌కు ఫిర్యాదు చేసింది.

'నారా'యణస్వామి భక్తి

కారంపూడి సర్కిల్‌లో కారంపూడి, రెంటచింతల, దుర్గి పోలీసుస్టేషన్లు ఉన్నాయి ఇక్కడ బీసీ వర్గానికి చెందిన సీఐ చినమల్లయ్య సమర్థంగా విధులు నిర్వహించారు. ఆయనను అర్థంతరంగా ఎన్నికల ముందు బదిలీ చేశారు. ఆయన స్థానంలో తమ సామాజిక వర్గానికి చెందిన నారాయణస్వామిని తెలుగుదేశం నాయకులు తీసుకువచ్చి పోస్టింగ్ ఇప్పించుకున్నారు. ఆయన వచ్చీ రాగానే తన సామాజిక వర్గ నాయకులకు పగ్గాలు ఇచ్చేశారు. ఎన్నికల్లో మీరు ఎలాగైనా పనిచేసుకోవచ్చని తెలుగుదేశం పార్టీలోని నాయకులకు అభయం ఇచ్చేశారు. ఆయన ఫోన్ కాల్, వాట్సప్, ఫేస్‌టైమ్ డేటాను పరిశీలిస్తే ఆయన తెలుగుదేశం పార్టీకి ఏ విధంగా పని చేసింది అర్థమవుతుందని వైఎస్సార్ సీపీ బృందం తన ఫిర్యాదులో పేర్కొంది.

ఫ్యాక్షన్ జూలు విదిల్చిన జూలకంటి

జూలకంటి బ్రహ్మానందరెడ్డిని టీడీపీ మాచర్ల ఇన్‌చార్జ్‌గా ప్రకటించినప్పటి నుంచి అక్కడ మళ్లీ ఫ్యాక్షన్ ఊపిరి పోసుకుంది. ఎప్పుడైతే ఆయనను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిందో అప్పటి నుంచి నియోజకవర్గంలో ఆయన సమస్యలు సృష్టించడం మొదలుపెట్టారు. మాచర్లను కైవసం చేసుకోవాలంటే పల్నాడు జిల్లాలో అప్పుడు ఉన్న ఐజీ, ఎస్పీ ఇతర అధికారులు ఉంటే సాధ్యం కాదని జూలకంటి, టీడీపీ అధినాయకులు గుర్తించారు. దీంతో వారు ఆ ఎస్పీని టార్గెట్‌గా చేసుకున్నారు. ఆయన ఉంటే బూత్ క్యాప్చర్, ఓటర్లను భయపెట్టడం కుదరని అభిప్రాయపడ్డారు. అప్పుడే పొత్తు పెట్టుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి ద్వారా పావులు కదిపారు. జిల్లాలో రెడ్డి, ఎస్సీ అధికారులు ఉంటే తమ పన్నాగం పారదని, వారిని మార్చాలని ఒత్తిడి తీసుకువచ్చారు. ఐజీ పాల్‌రాజ్‌ను బదిలీ చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించకపోయినా గత తెలుగుదేశం ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఒక అధికారికి సన్నిహితంగా ఉండే అధికారిని తీసుకువచ్చి పోస్టింగ్ ఇప్పించారు. పల్నాడు ఎస్పీగా గతంలో సెబ్ అడిషనల్ ఎస్పీగా పనిచేసిన బిందుమాదవ్‌ను తీసుకువచ్చారు. వారు వచ్చిన తర్వాత కిందిస్థాయి సిబ్బందికి తెలుగుదేశం నాయకులను టచ్ చేయవద్దంటూ మౌఖిక ఆదేశాలు వెళ్లాయి.

పేట్రేగిపోయిన పచ్చమూకలు

11న రెంటచింతలకు వెళ్లిన సీఐ నారాయణ స్వామి తెలుగుదేశం నేతలకు మీ ఇష్టం వచ్చినట్లు ఎన్నిక నిర్వహించుకోండని చెప్పినట్లు సమాచారం. దీంతో టీడీపీ నేతలు పేట్రేగిపోయారు. అదేరోజున కారంపూడి మండలం వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డిపై దాడి చేసి బెదిరించారు. వేపకంపల్లిలో తెలుగుదేశం నేతలు మహేష్ అనే వ్యక్తిపై ఆరోపణలు చేసి అతనిపై దాడి చేస్తే తొలుత ఒక హెడ్ కానిస్టేబుల్‌ను పంపారు. ఆ తర్వాత సీఐ వెళ్లి మహేష్‌ను కరెంట్ స్తంభానికి కట్టేయించి అవమానించారు. 12న రెంటచింతలలో నారాయణస్వామి ఉండగానే తెలుగుదేశం నేతలు మోర్తాల ఉమామహేశ్వరరెడ్డిపై దాడి చేశారు. రెంటచింతల మండలం పాల్వాయిగేట్ పోలింగ్ స్టేషన్ 201, 202 వద్ద టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ ఏజెంట్లనూ అనుమతించలేదు. తొమ్మిది గంటల ప్రాంతంలో ఐజీ శ్రీకాంత్ జోక్యంతో ఏజెంట్లను అనుమతించారు. జెట్టిపాలెంలో 214, 217 పోలింగ్ బూత్‌లలోకి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను అనుమతించలేదు. దీనిపై గ్రామస్తులు ప్రశ్నించినప్పుడు సీఐ నారాయణస్వామి వచ్చి వైఎస్సార్ సీపీ ఏజెంట్లను భయపెట్టి బయటకు పంపారని గ్రామస్తులు చెబుతున్నారు. తుమ్మకోటలో టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడినప్పుడు ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈవీఎంలూ ధ్వంసమయ్యాయి. ఆ తర్వాత కొత్త ఈవీఎంలు పెట్టి వైఎస్సార్ సీపీ ఏజెంట్లు లేకుండానే ఎన్నిక కొనసాగించారు. వెల్దుర్తిలోని 137, 138, 139, 140, 141 పోలింగ్ స్టేషన్లలో రాత్రి ఏడు గంటల తర్వాత వైఎస్సార్ సీపీ ఏజెంట్లను బయటకు పంపి రిగ్గింగ్ చేశారు. దీనిపై ఎస్పీకి ఫిరాదు చేసినా స్పందించలేదు. ఒప్పిచర్లలో 250, 251, 252, 256 పోలింగ్ స్టేషన్లలో ఇతర సామాజిక వర్గాల వారు ఓటు వేసుకోలేని పరిస్థితి నెలకొంది.

దాడులకు పాల్పడినా చర్యల్లేవు



ఈనెల 14న కారెంపూడి బస్టాండ్‌వైపు దూసుకు వస్తున్న టీడీపీ మూకలు

వెల్దుర్తి పరిధిలో కొందరు టీడీపీ నేతలు పోలీసు కానిస్టేబుళ్ల మీద చేయి చేసుకున్నట్లు ఫిర్యాదు రిజిస్టర్ అయినా దాడి చేసిన వారిని కనీసం స్టేషన్‌కు కూడా పిలవలేదు. ఎన్నికల ముందు బైండోవర్ కూడా చేయలేదు. ఎన్నికలకు మూడు రోజుల ముందు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్య శిరిగిరిపాడు గ్రామంలో ప్రచారం చేస్తుండగా ఆమెపై దాడి చేశారు. బందోబస్తుగా వచ్చిన ఎస్ఐ ఇతర పోలీసు సిబ్బందిపై కూడా తెలుగుదేశం నేతలు దాడి చేశారు. దీనిపై రెండు ఫిర్యాదులు వచ్చినా దాడి చేసిన వారిని ఎవరినీ పోలీసుస్టేషన్‌కు పిలవలేదు. పైగా బాధితులైన ఎస్ఐతోపాటు కారంపూడి, మాచర్ల టౌన్ సీఐలను బదిలీ చేశారు. దీంతో పోలీసుల్లో అభద్రతా భావం ఏర్పడింది. దీన్ని అడ్డం పెట్టుకుని తెలుగుదేశం నాయకులు గ్రామాల్లో రెచ్చిపోయారు. రెంటచింతలలో సుమారు రెండు లక్షల హోలోగ్రామ్ ఉన్న ఓటర్ స్లిప్‌లను స్వాధీనం చేసుకుంటే కలెక్టర్ చర్యలు తీసుకోకపోగా బస్‌ను కూడా సీజ్ చేయకుండా వదిలేశారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎస్పీ బిందుమాధవ్‌తోపాటు కొంతమంది అధికారులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకున్నా.. ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించిన మరికొందరు అధికారులను కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇసుక అక్రమ తవ్వకాలపై కొరడా

- తనిఖీలకు రెండు షిఫ్టులుగా బృందాలు
- అక్రమ తవ్వకాలు జరిగితే బాధ్యులపై కేసులు
- కొల్లిపర మండలంలో ఇసుక రీచ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ
- ఫిర్యాదులకు కంట్రోల్ రూం నంబర్ 0863-2234301



కొల్లిపర మండలం మున్నంగి ఇసుక రీచ్‌లో జిల్లా అధికారులతో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

తెనాలి: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో ఇసుక తవ్వకాలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిబంధనలు మీరితే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం ఎస్పీ తుషార్ డూడీ, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలిసి కొల్లిపర మండలంలోని ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు. మండలంలోని బొమ్మువానిపాలెం 14, 15 ఇసుక రీచ్‌లు, మున్నంగిలోని ఇసుక రీచ్‌లను అధికారులు పరిశీలించారు. తాడేపల్లి మండలంలోని గుండెమెడ ఇసుక రీచ్‌నూ తనిఖీ చేశారు. ఎన్జీటీ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో తవ్వకాలు జరపరాదని, అనుమతులు పొందిన ప్రాంతంలోనే మనుషులతో తవ్వకాలు జరపాలని ఆదేశించారు. మైనింగ్ శాఖ అధికారులతోపాటు పోలీస్, రెవిన్యూ, శాండ్ కమిటీలోని ఇతర శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. దీనికోసం రెండు షిఫ్టులుగా బృందాలను నియమించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్టు గుర్తించిన వెంటనే పోలీస్ అధికారులు కేసులు నమోదుచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పారు.

కలెక్టరేట్‌లో ఇసుక కమిటీతో సమావేశం

అంతకుముందు కలెక్టరేట్‌లోని ఎస్‌సీ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులతో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సమావేశమయ్యారు. జిల్లాస్థాయి సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ కమిటీ ఏర్పాటైందని, ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా అందరూ సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతివారం రీచ్‌లను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని చెప్పారు. కమిటీలోని శాఖలు క్షేత్రస్థాయిలో అధికారులతో ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ బృందాలను ఏర్పాటుచేయాలని సూచించారు. ఇసుక అక్రమ తవ్వకాలపై జిల్లాస్థాయిలో కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ నంబర్ 0863-2234301తోపాటు ఈ-మెయిల్ dismc2024@gmail.comకు కూడా ఫిర్యాదులను పంపవచ్చని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకర్, తనిఖీల్లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ కన్వీనర్, మైనింగ్ శాఖ డీడీ చంద్రశేఖర్, జిల్లా ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, భూగర్భ జలవనరులశాఖ డెప్యూటీ డైరెక్టర్ వందనం, ఎన్విరాన్మెంట్ ఇంజినీరు నారాయణ, జిల్లా ఉప రవాణా కమిషనర్ కరీం, ఆర్‌డబ్ల్యుస్ ఈఈ కళ్యాణ చక్రవర్తి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలి



శిక్షణలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో డీఈఓ శైలజ

ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంచుకోవాలని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సీబీఎస్ఈ బోధనపై గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని ఉపాధ్యాయులకు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. గణిత, భౌతిక, రసాయనశాస్త్ర పాఠ్యాంశాలను బోధించే ఉపాధ్యాయులకు జిల్లా పరిశీలకుడు రవీంద్రనాథ్‌రెడ్డి సూచనలు, సలహాలు ఇచ్చారు. సాంకేతిక బోధనా పద్ధతులను అలవర్చుకోవాలని చెప్పారు. డీఈఓ పి.శైలజ మాట్లాడుతూ సీబీఎస్ఈ పాఠశాలల్లో పని చేస్తున్న ఇంగ్లిషు, సోషల్, బయాలజీ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ఇటీవల రెండు రోజుల పాటు శిక్షణ విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. ప్రస్తుతం గణిత, భౌతిక, రసాయన శాస్త్రాలను బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో గుంటూరు డీవైఈఓ పి.వెంకటేశ్వరరావు, సీమ్యాట్ నుంచి వచ్చిన పరిశీలకురాలు ఎ.సుహాసిని, ఎంఈఓ పి.వెంకటేశ్వరరావు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

25 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

నగరం: బాపట్ల జిల్లా నగరంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు సోమవారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూజల అనంతరం ప్రతిరోజూ అన్నదానం చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నృసింహస్వామి జయంత్యుత్సవాలు



ఉత్సవంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు సోమవారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠ నరసింహమూల మంత్ర హోమం, సాయంత్రం ఆరు గంటలకు విశ్వక్సేన పూజ, అగ్నిప్రణయనం, కుమ్భారాధన నారసింహ హోమం పూజలు చేశారు. అనంతరం స్వామికి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.



గ్రామోత్సవంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు

బాటిళ్లు, క్యాన్లలో పెట్రోల్ పోయొద్దు

బంకుల యాజమాన్యాలకు కలెక్టర్ ఆదేశం

గుంటూరు వెస్ట్: బాటిళ్లలో, క్యాన్లలో పెంట్రోల్ పోయొద్దని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సోమవారం బంకుల యాజమాన్యాలను ఆదేశించారు. వచ్చేనెల 4న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అల్లర్లూ జరగకుండా ఉండేందుకు ఈ మేరకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని పేర్కొన్నారు. బంకుల్లో పరిస్థితులను తహసీల్దార్లు, ఆర్డీఓలు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజయోత్సవాలు నిషేధం

కౌంటింగ్ తర్వాత గెలిచిన అభ్యర్థులు ఊరేగింపులు, ర్యాలీలు, బహిరంగ విజయోత్సవాలు నిర్వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. బాణసంచా దుకాణదారులు పెద్దమొత్తంలో సరుకు అమ్మరాదని తేల్చిచెప్పారు.

మొగదారమ్మ ఉత్సవాలు ప్రారంభం

నిజాంపట్నం: మత్స్యకారుల ఇలవేల్పు అయిన మొగదారమ్మ తల్లి సిడిమాను ఉత్సవాలు నిజాంపట్నంలో సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొంటారు. ఉత్సవాలను పురస్కరించుకుని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, ఆయన సోదరుడు మోపిదేవి హరనాథబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట రమణారావు మాట్లాడుతూ మొగదారమ్మ తల్లి సిడిమాను ఉత్సవాల్ని ఏటా అంగరంగవైభవంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ అన్నారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆయన తెలిపారు.

ఉత్సాహంగా జల క్రీడలు

ఉత్సవాలను పురస్కరించుకుని తొలిరోజు ఉత్సాహంగా జల క్రీడలు నిర్వహించారు. ప్రత్యేక వాహనాలపై నీటిని ఏర్పాటు చేసి గ్రామ వీధుల్లో డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో తిరుగుతూ యువత కోలాహలంగా చిమ్ముకుంటూ జల క్రీడల్ని నిర్వహించారు.

300 మంది దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ


కృత్రిమ చేతులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మంగళగిరి: దేశంలోనే తొలిసారిగా 300 మంది దివ్యాంగులకు కృత్రిమ చేతులు పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు కొనియాడారు. పట్టణంలోని వీజేటీఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో రూ.1.35 కోట్లతో జర్మనీకి చెందిన ద హ్యాండ్స్ ప్రాజక్టు సహకారంతో కృత్రిమ చేతులను (జెమ్ ఎంకే 1 హ్యాండ్స్) పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ పీడీజీ డాక్టర్ రవి వడ్లమాని, డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.శరత్ చౌదరి, డాక్టర్ ఎస్వీ రామ్‌ప్రసాద్, పీడీజీ అన్నే రత్న ప్రభాకర్, ఐపీడీజీ తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి, పీడీ ఆర్.ఆర్. వేణుగోపాల్ యలమంచిలి, విజేటీఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గోలి రామ్మోహన్‌రావు, ప్రాజెక్ట్ చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి కృత్రిమ చేతులు పంపిణీ చేసి ప్రసంగించారు. వారంపాటు కృత్రిమ చేతులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. జర్మనీ, న్యూజిల్యాండ్, ఆఫ్రికా దేశాల నుంచి టెక్నీషియన్లు వచ్చి బాధితులకు కృత్రిమ చేతుల వాడకంపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై అట్రాసిటీ కేసు

తాడికొండ: తుళ్లూరు మండలం వడ్లమాను గ్రామంలో ఎన్నికల సమయంలో కారంశెట్టి వెంకట్రావు ఇంటిపైకి వెళ్ళి దాడి చేసిన ఐదుగురు టీడీపీ నాయకులపై తుళ్ళూరు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నేతలు గోళ్ళ గోపీనాథ్‌రెడ్డి, చిలుకూరి జగదీష్ రెడ్డి, చల్లా మన్మథరెడ్డి, ఉయ్యూరు రాజశేఖరరెడ్డి, చల్లా వెంకట నరసింహారెడ్డి ఎన్నికల ముందు రోజు గ్రామ సెంటర్‌కు వచ్చిన కారంశెట్టి వెంకట్రావును టీడీపీకి ఓట్లు వేయాలని అడిగారు. అందుకు ఆయన నిరాకరించాడు. దీంతో చిన్నపాటి వివాదం జరిగింది. ఆగ్రహించిన టీడీపీ నేతలు వెంకట్రావు ఇంటిపైకి వెళ్ళి కులం పేరుతో దూషించడంతోపాటు తల నరికి సైలెన్సర్‌కు వేలాడదీసుకొని వెళతామని బెదిరించారు. ఈ నేపథ్యంలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీహెచ్ అనురాధ తెలిపారు.

పేరంటాలమ్మ తిరునాళ్లు


గుమ్మడిసిడి ఊరేగింపు


హారతులిస్తున్న మహిళలు

తెనాలి: అయితానగర్‌లో రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీవెంకయ్య–గౌరమ్మ దేవస్థానంలో పేరంటాలమ్మ తిరునాళ్లు వైభవంగా జరుగుతున్నాయి. తిరునాళ్ల సందర్భంగా ఆలయం మొత్తాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈనెల 18 నుంచి ప్రారంభమై 22వ తేదీ వరకూ జరిగే ఉత్సవాల్లో భాగంగా రోజూ వెంకయ్య–గౌరమ్మలకు విశేష పూజలు చేస్తున్నారు. రెండోరోజైన ఆదివారం రాత్రి గుమ్మడి సిడి మహోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక భక్తులతోపాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది మహిళలు తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈత పండ్లు, తాటికాయలు, వేపాకులతో ప్రత్యేకంగా సిడిమానును అలంకరించారు. కనకతప్పెట్లు, డప్పులతో ఆలయ ప్రదక్షిణలు చేశారు. మహిళలు గుమ్మడికాయలు తెచ్చి సమర్పించారు. అనంతరం గుమ్మడి సిడి కార్యక్రమంలో భాగంగా సిడిమాను ఊరేగింపు నిర్వహించారు. పేరంటాలమ్మ గుడి వద్ద నుంచి ప్రారంభమై పట్టణ వీధుల్లో ఊరేగింపు సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం జలబిందెలు, పాప వేషధారణ, పూల కప్పెర కార్యక్రమాలు జరిగాయి. బుధవారం ఉదయం నుంచి పొంగలి నైవేద్యం సమర్పణ, గండ దీపాలు, అడుగులు–మడుగులు, పసుపుబండ్లు, కరెంటు ప్రభల ఊరేగింపు, మేక సిడి, గంప సిడులతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల నిర్వహణను స్థానిక పెద్దలు పర్యవేక్షిస్తున్నారు.

మానసిక వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ వడ్డాది


డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్


డాక్టర్ పసుపుల సాయికిరణ్

గుంటూరు మెడికల్: మానసిక వైద్య నిపుణుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా డాక్టర్ పసుపుల సాయికిరణ్, కోశాధికారిగా డాక్టర్ నెక్కంటి నిమిషా ఎన్నికయ్యారు. గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, మిగతా ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేయడం గమనార్హం. జాయింట్ సెక్రటరీగా డాక్టర్ జి.జగదీష్ ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గాన్ని సోమవారం గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతి, పలువురు మానసిక వైద్య నిపుణులు అభినందించారు. మానసిక సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించి వ్యాధుల బారిన పడకుండా చైతన్యం కల్పిస్తామని డాక్టర్ వెంకటకిరణ్ తెలిపారు. యువ వైద్యులు, వైద్య విద్యార్థులకు అకడమిక్ కార్యక్రమాల్లో భాగంగా ప్రతినెలా సీఎంఈలు నిర్వహించి వారిలో నైపుణ్యాన్ని పెంపొందిస్తామన్నారు. సంఘం బలోపేతం కోసం కృషి చేస్తామని వెల్లడించారు.

పోలింగ్ రోజు జరిగిన గొడవలపై విచారణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధితోపాటు దుగ్గిరాల మండలంలో పోలింగ్ రోజు జరిగిన గొడవలపై డీఎస్పీ సీహెచ్ రవికాంత్ సోమవారం విచారణ చేపట్టారు. మే 13న పలు పోలింగ్ కేంద్రాల వద్ద కొందరు గొడవలు సృష్టించి దాడులకు పాల్పడ్డారు. వారు ఏ పార్టీకి చెందిన వారు, జరిగిన గొడవలు ఏమిటి? ఎవరెవరు చేశారు? ఎంతమంది పాల్గొన్నారు అనే వివరాలను డీఎస్పీ సేకరించారు. కొందరు జూన్ 4న దాడులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో ముందుగానే పసిగట్టి అనుమానితులకు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చేందుకు పోలీసులు కసరత్తు చేపట్టారు. అనుమానితుల పేర్లు సేకరిస్తున్నట్టు సమాచారం.

రేపు ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ మెగా లోన్ మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఈనెల 22న బుధవారం ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన మెగా లోన్ మేళా నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లకు మద్దతుగా తాము మెగా లోన్ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దీనిలో పాల్గొనే వారికి ఉచిత ప్రవేశ రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉంటుందని వివరించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈనెల 22న సోమవారం ఉదయం 10 గంటలకు నోరీ హాస్పిటల్ సమీపంలోని ఎంఎస్ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగే మెగాలోన్ మేళాకు హాజరు కావాలని కోరారు. మెగాలోన్ మేళాలో పాల్గొనేందుకు ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో స్వయంగా గానీ 79959 15450, 89197 37517 నంబర్లలోగానీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

ఈదురుగాలుల బీభత్సం

నకరికల్లు: మండలంలో సోమవారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలులు వీయడంతోపాటు భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగి స్తంభాలు విరిగి పడ్డాయి. పలుగ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పెట్రోల్ బంకుల తనిఖీ


చేబ్రోలులో పెట్రోలు బంకు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ట్రైనీ ఐపీఎస్ మనోజ్ కుమార్ హెగ్డే

చేబ్రోలు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం హద్దు మీరి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ ఐపీఎస్ మనోజ్ కుమార్ హెగ్డే హెచ్చరించారు. చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లోని పెట్రోలు బంకులను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది, యజమానులకు సూచనలు చేశారు. వాహనాలకు మాత్రమే పెట్రోలు, డీజిల్‌ను పోయాలన్నారు. డబ్బాలు, బాటిళ్లు, క్యాన్లలో పెట్రోలు, డీజిల్ పోయొద్దని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. చేబ్రోలులోని వైఎస్సార్ సీపీ, టీడీపీ కార్యాలయాలను సందర్శించి అక్కడ పార్టీ నాయకులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున ప్రజాశాంతికి భంగం కలిగించకూడదని స్పష్టం చేశారు. ఆయన వెంట స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన కేంద్ర బృందం


కేంద్రబృంద సభ్యులకు సచివాలయ పనితీరును వివరిస్తున్న సిబ్బంది

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడి గ్రామ సచివాలయాన్ని ఆరుగురు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల కేంద్ర బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా చింతలపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి మణికంఠ మాట్లాడుతూ భారత్ సందర్శన్ కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం సభ్యులు అమరదీప్ చాహన్, పూజ, శృతి, జహలేష్ యాదవ్, కపిల్, ధృవ్ ధమిజలు చింతలపూడి సచివాలయాన్ని సందర్శించారని, వారికి సచివాలయ పనితీరును, స్వామిత్వ విధానాన్ని వివరించామని, అనంతరం దుగ్గిరాల గ్రామంలోని కాంటినెంటల్ కాఫీ పరిశ్రమలో కాఫీ పొడి తయారీ విధానాన్ని వారు పరిశీలించారని తెలిపారు. కార్యక్రమంలో దుగ్గిరాల విస్తరణాధికారి శ్రీనివాసరావు, తుళ్లూరు విస్తరణాధికారి నాగా అనంత్, పంచాయితీ కార్యదర్శి మూర్తి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రాణం తీసిన ఈత సరదా

బీటెక్ విద్యార్థి మృతి



తాడేపల్లి రూరల్ : బంధువుల ఇంటికి వచ్చి సరదాగా ఈత కొడదామని కృష్ణానదికి వెళ్లి నీటిలో మునిగిపోయి బీటెక్ విద్యార్థి ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. తాడేపల్లి ఎస్ఐ సాయిప్రసాద్ కథనం ప్రకారం.. గుంటూరు సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన వాసుబాబు కుమారుడైన టి.అవినాష్ (19) గుంటూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు సెలవులు కావడంతో తాడేపల్లి మహానాడులోని బంధువుల ఇంటికి వచ్చి ఆదివారం సాయంత్రం సరదాగా దిగువ ప్రాంతంలోని పుష్కర ఘాట్ల వద్ద ఈతకు వెళ్లాడు. అందరూ పైన కూర్చుని ఉండగా, అవినాష్ మరో యువకుడు నదిలోకి దిగారు. ఈ సమయంలో అవినాష్ నీటిలో మునిగిపోయాడు. స్థానిక మత్స్యకారులు గాలించినా ఫలితం లేకపోయింది. పోలీసులకు సమాచారం అందించడంతో స్థానిక గజ ఈతగాళ్ల సహాయంతో అవినాష్‌ను బయటకు తీశారు. అయితే అతను అప్పటికే మృతి చెందాడు. ఘటనపై అవినాష్ తండ్రి వాసుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయి ప్రసాద్ తెలిపారు.

లారీని ఢీకొన్న మినీ బస్– ఆరుగురికి గాయాలు



గుంటూరు రూరల్: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మినీ బస్ ఢీకొనడంతో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన అంకిరెడ్డిపాలెం సమీపంలోని హైవేపై సోమవారం జరిగింది. సీఐ నరేష్ కుమార్ కథనం ప్రకారం విశాఖపట్నం సిటీలోని అక్కయ్యపాలెంకు చెందిన 20 మంది తిరుపతి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి మినీబస్‌లో ఇంటికి బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున అంకిరెడ్డిపాలెం సమీపంలో హైవే పక్కనే ఆగి ఉన్న లారీని మిని బస్ ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో అందరూ నిద్రావస్థలో ఉన్నారు. ప్రమాదంలో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందుభాగం దెబ్బతింది. క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించి మరో బస్‌లో ఇళ్లకు పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.